## క్లుప్తంగా

### ప్రవేశ పరీక్షలకు 15 మంది విద్యార్థుల గైర్హాజరు



**ఇందల్వాయి:** ఇందల్వాయి ఎస్టీ గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. పాఠశాలకు 224 మంది విద్యార్థులను ప్రవేశ పరీక్ష రాసేందుకు కేటాయించగా 15 మంది విద్యార్థులు హాజరు కాలేదని, మిగితా 209 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని సోషల్ వెల్ఫేర్ ఆర్సీ మేరీ ఏసుపాదం తనిఖీ చేసినట్లు వివరించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



**నిజామాబాద్‌నాగారం:** నిజామాబాద్ జిల్లా గాండ్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గాండ్ల పట్టణ సంఘం సిర్నాపల్లి గడీలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్, అధ్యక్షుడిగా డీజీ సాయన్న, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజు, మోహన్, నాగేశ్వరరావు, సాయిరాం, కోశాధికారిగా నర్సయ్య, ఉప కోశాధికారిగా బాల్‌రాజ్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, గంగారాం, ఆర్.గంగాధర్, సాయిలు, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, అంజయ్య, రవీందర్, రఘురాజ్, సలహాదారులుగా కె.లక్ష్మణ్, రాజేందర్, అశోక్, చిన్ననాగరాజ్, తదితరులను ఎన్నుకున్నారు.

### పుస్తకాలు హస్త భూషణాలు



**నిజామాబాద్‌నాగారం:** చేతికి పుస్తకాలు ఆభరణం వంటివి అని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం వినాయక్‌నగర్ లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ కూడా పుస్తక ప్రియుడేనన్నారు. ఆయనలా పుస్తకాన్ని అంతలా ప్రేమించిన వ్యక్తిని మనం చూడలేమన్నారు. సంవత్సరాల, రోజుల తరబడి పుస్తక పఠనంతోనే అంబేడ్కర్ మునిగిపోయేవారని గుర్తు చేశారు. సంఘం సభ్యులు బాబూరావు, రమేష్, ప్రవీణ్‌లాల్ తదితరులున్నారు.

### స్నేహ సొసైటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు



**నిజామాబాద్ నాగారం:** స్నేహ సొసైటీకి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని, అందుకే కేంద్ర ప్రభుత్వ అధికారులు సైతం శిక్షణ కోసం ఇక్కడికి వస్తున్నారని స్నేహ సొసైటీ అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. ఆదివారం 31వ వార్షిక సాధారణ సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా చాలా మందికి గుండెపోటు వస్తుందని, ఈ నేపథ్యంలో స్నేహ సొసైటీకి సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తద్వారా హార్ట్ ఎటాక్ గురైన వ్యక్తులను కాపాడవచ్చన్నారు. అనంతరం సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, ఆదాయ వ్యయాలపై నివేదికను చదివి వినిపించారు. జ్యోతి, వీరేశం, దయానంద్, సుధాకర్, తదితరులున్నారు.

### పీవీ విగ్రహం ఏర్పాటుకు కృషి



**నిజామాబాద్ సిటీ:** బ్రాహ్మణ సంక్షేమ సంఘం భవన నిర్మాణంతో పాటు మాజీ ప్రధాని పీవీ విగ్రహ ఏర్పాటుకు హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం (ఇందూరు) కృతజ్ఞతలు తెలిపింది. ఆదివారం రాత్రి రైల్వే స్టేషన్ రోడ్డు గీత భవనంలో సంఘం సర్వసభ్య మొదటి సమావేశం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షుడు కంజర్కర్ భూపతి రావు మాట్లాడుతూ .. బ్రాహ్మణ ఐక్యత, సంఘటితం కోసం ఎంఎల్‌ఏలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరలో బోర్గం చౌరస్తాలో పీవీ విగ్రహం ప్రతిష్ఠాపన, సంఘాల భవన నిర్మాణ భూమి పూజ చేయడానికి ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు కిరణ్ దేశ్ ముఖ్, కార్యదర్శి రొట్టె సురేష్ పాల్గొన్నారు.

# వడ్డీ మాఫీ నిధులేవి?

- 45 రోజులు గడిచినా ఇవ్వని ప్రభుత్వం
- ఎదురుచూస్తున్న మహిళాసంఘాలు
- మండలానికి రూ.2.97 కోట్లు మంజూరు



**మోపాల్(నిజామాబాద్‌రూరల్) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రవేశపెట్టిన వడ్డీ మాఫీ పథకం నిధులు ఇంకా జమ కాలేదు. 45 రోజులు గడుస్తున్నా నిధులను విడుదల చేయలేదు. వడ్డీ మాఫీ పథకం ప్రకటనతో గ్రామ సమాఖ్యల్లోని సభ్యులు ఎంతో సంబరపడ్డారు. కార్యక్రమాలను కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కానీ నిధుల కోసం మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. త్వరగా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని మహిళలు కోరుతున్నారు. మోపాల్ మండలంలో 744 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. అందులో తొమ్మిది వేల వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. గతంలోనే ఆర్థికమంత్రి హరీష్‌రావు మహిళా సమాఖ్యల వడ్డీ మాఫీని రెండు విడతల్లో చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. 2018–19కు సంబంధించి 3 నెలలు, 2019–20 కు గాను సంబంధించిన రుణాలకు వడ్డీని మొదటి విడతగా మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో మొత్తం 15 నెలలకు సంబంధించి రూ.2,97,67,063 కోట్లు మంజూరయ్యాయి. ఇంకా రెండేళ్లకు సంబంధించి వడ్డీ మాఫీ కావాల్సి ఉంది.

### ఉత్తర్వులు వెలువడినా..!

మార్చి 8వ తేదీన వడ్డీ మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి 45 రోజులు గడిచినా.. గ్రామ సమాఖ్య ఖాతాల్లో జమకాలేదు. ఈ నిధుల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. అధికారికంగా మాత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి. మిగతా 24 నెలలకు సంబంధించిన రెండో విడత వడ్డీ మాఫీ ప్రకటన ఎప్పుడు వస్తుందో తెలియదు. ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కూడా ఖాతాల్లో జమ చేసేందుకు ఇంత గడువు ఎందుకు అవుతుందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. కాగా ఇది కేవలం ఎన్నికల కోసం ప్రకటించిన స్కీం అని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. మహిళల ఓట్ల కోసం అధికార పార్టీ వేసిన ఎత్తుగడగా వారు అభిప్రాయపడుతున్నారు.

### త్వరలోనే జమవుతాయి

ప్రభుత్వం 15 నెలలకు సంబంధించి వడ్డీ మాఫీ ప్రకటించడంతో మహిళలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి రూ.2.97కోట్లు వడ్డీ మాఫీ నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే గ్రామ సమాఖ్యల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. మహిళలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – మోహన్, ఏపీఎం, మోపాల్

## అటెన్షన్ ప్లీజ్..

### కాలువను తలపించేలా..



ఇందల్వాయి బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపు నీరు

మండల కేంద్రంలో బస్టాండ్‌కు వెళ్లే దారిలో భారీగా వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – ఇందల్వాయి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి-తిర్మన్‌పల్లి

ఫోన్ నంబర్ : 63017 90609

# పనిచేసే వారిని ఆదరించండి



బ్యాంక్‌కాలనీ(పాంగ్రా)లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి



పుప్పాల రవిని సన్మానిస్తున్న ఆర్టీసీ చైర్మన్

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విజ్ఞప్తి
- రూరల్ మండలంలో సుడిగాలి పర్యటన
- రూ.17 కోట్ల 11 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నిజామాబాద్ సిటీ:** పని చేసే వారిని ఆదరించాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, కార్పొరేషన్‌లో కలిసిన విలీన గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రూరల్ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మాధవనగర్‌లో రూ.4.45 కోట్ల నిధులతో, బ్యాంక్ కాలనీ(పాంగ్రా)లో 2.45 కోట్లతో, గూపన్ పల్లిలో రూ.4.80 కోట్లతో, కాలూర్‌లో రూ.1.95 కోట్లతో, ఖానాపూర్‌లో రూ.కోటితో, సారంగపూర్‌లో రూ.1.36 కోట్లతో బీటీరోడ్లు, సీసీరోడ్లు, సీసీ డ్రైనేజీలు, వైకుంఠధామాలు, ప్రహరీల నిర్మాణాలకు ఆర్టీసీ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయితే నిధులు వస్తాయో రావో అనే అనుమానం విలీన గ్రామాల ప్రజలో ఉండేదని, ప్రభుత్వం విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.26 కోట్లు మంజూరు చేసిందన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గడిచిన నాలుగున్నరేళ్లలో ఆయనకు వచ్చిన నిధులు, అలాగే ఎంపీ తండ్రి డి.శ్రీనివాస్ ఎంపీగా ఉన్న సమయంలో వచ్చిన నిధుల్లో నుంచి విలీన గ్రామాలకు ఒక్క రూపాయి కేటాయించలేదని, తండ్రీకొడుకులకు వచ్చిన రూ.40 కోట్ల నిధులు ఏం చేశారో తెలియదన్నారు. అనంతరం సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మాధవనగర్, పాల్దా, గుండారంల సొసైటీల చైర్మన్లు దాసరి నాగేశ్వర్‌రావు, జితేందర్, శ్రీధర్, 4వ డివిజన్ నాయకులు మల్లెపూల నర్సింహాచారి, శ్రీకాంత్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

### గల్ఫ్ బాధితులపై పరిశోధన అభినందనీయం

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** ఉపాధి కోసం ఎడారి దేశం వెళ్లి, దుర్భర జీవనం వెళ్లదీస్తున్న గల్ఫ్ బాధితులపై తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి పుప్పాల రవీందర్ పరిశోధన చేయడం అభినందనీయమని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈ మేరకు పుప్పాల రవీందర్‌ను బాజిరెడ్డి గోవర్ధన్ తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో కూడిన పరిశోధనలకు ఎల్లప్పుడు ప్రాధాన్యం ఉంటుందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి సమాజానికి ఉపయోగపడే మరెన్నో పరిశోధనలు రావాలని ఆకాంక్షించారు. రవీందర్ గైడ్ కనకయ్యను బాజిరెడ్డి అభినందించారు.

# ఇందల్వాయి పరిధిలో పంటల పరిశీలన



గన్నారంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ప్రదీప్

**ఇందల్వాయి:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నష్టపోయిన పంటలను రూరల్ ఏడీఏ పిండి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు ఆదివారం పరిశీలించారు. గన్నారంలో తడిసిన ధాన్యాన్ని, వడగళ్లకు రాలిన వరి పొలాలను, నల్లవెల్లి గ్రామంలో నేలకొరిగిన నువ్వుల పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట నష్టం వివరాలను నమోదు చేసి పై అధికారులకు నివేదిక అందిస్తామని, తడిసిన ధ్యాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఏడీఏ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఎంపీపీ రమేష్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఆర్ఐ వహీద్, ఏఈవోలు శ్రీహరి, ప్రకాష్ గౌడ్ తదితరులున్నారు.

### కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**ఖలీల్‌వాడి :** నగరంలో ప్రగతినగర్ లోని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సమక్షంలో ఆదివారం కోటగల్లీ, జెండాగల్లీ కాలనీకు చెందిన మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ మేయర్ సంజయ్ కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు విసిగిపోయి మహిళలు కాంగ్రెస్ పార్టీ లోకి వస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని బలపర్చి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ సిలిండర్ ను రూ.500కే అందిస్తామన్నారు.

# రూ.25 వేల నష్ట పరిహారమివ్వాలి



**సిరికొండ:** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.15 వేలు నష్ట పరిహారం చెల్లించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానలతో రెండు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతింటే ప్రభుత్వం లక్షన్నర ఎకరాలకు మాత్రమే నష్ట పరిహారం మంజూరు చేస్తామని ప్రకటించడం శోచనీయమన్నారు. పంటల నష్టంపై సర్వే చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కూడా నత్తనడకన జరుగుతున్నాయని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట రైతులను ముంచవద్దని కోరారు.

# ఫోన్‌తో ఆడి సమయం వృథా చేసుకోవద్దు

- జీపీఎల్‌ను ప్రారంభించిన సీఐ కృష్ణ



క్రీడాకారులతో డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై గణేశ్

**డిచ్‌పల్లి:** వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులు మొబైల్ ఫోన్‌తో ఆడుతూ సమయం వృథా చేసుకోవద్దని క్రీడాపోటీల్లో పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలని డిచ్‌పల్లి సీఐ కృష్ణ సూచించారు. ఆదివారం సాయంత్రం ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్న ఘన్‌పూర్ ప్రీమియం లీగ్(జీపీఎల్) క్రికెట్ పోటీలను సీఐ కృష్ణ ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా వారిని ఎంగేజ్ చేయడానికి ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 4 జట్లు పాల్గొంటున్న ఈ జీపీఎల్‌లో ఒక్కో జట్టు 9 మ్యాచ్‌లు ఆడుతుందని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు టోపీలు, టీషర్టులను సీఐ కృష్ణ, ఎస్సై గణేశ్ అందజేశారు. వీడీసీ సభ్యులు కుర్రి రామకృష్ణ, సతీష్‌రెడ్డి, వివిధ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# బసవేశ్వరుడి ఆశయసాధనకు కృషి చేయాలి

- ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, మేయర్

**సుభాష్‌నగర్:** కుల, మత, లింగ, వర్గ, వర్ణ భేదాలకు వ్యతిరేకంగా మహాత్మా బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని, అందుకే ఆయనను విశ్వగురువుగా, గొప్ప దార్శనికుడిగా, సంస్కారవాదిగా ప్రపంచం కీర్తిస్తుందని వక్తలు కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ దండు నీతూకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ.. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ.. వీరశైవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వీరశైవ సమాజ్ బాధ్యులు సిద్ధ లింగయ్య స్వామి, శివకుమారప్ప, తదితరులు పాల్గొన్నారు.

### మహనీయుల ఆలోచనా విధానాలతో ముందుకు సాగాలి

**డిచ్‌పల్లి:** మహనీయుల ఆలోచనా విధానాలతో మనమంతా ముందుకు సాగితే సమాజం సన్మార్గంలో నడిచి అభివృద్ధి చెందుతుందని కమాండెంట్ ఎస్వీ సత్యశ్రీనివాసరావు అన్నారు. ఆదివారం డిచ్‌పల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్‌లో మహాత్మా బసవేశ్వర జయంతి ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి కమాండెంట్ సత్యశ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కమాండెంట్ సత్యశ్రీనివాసరావు, అధికారులు

# ఈద్గాలో రాజకీయాలు వద్దు

**ఖలీల్‌వాడి:** రంజాన్ సందర్భంగా ఈద్గాలో ప్రార్థనలు చేసిన తర్వాత ఉపన్యాసంలో రాజకీయాల ప్రస్తావన తీసుకురావడం సరైనది కాదని కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ కైసర్ ఆదివారం అన్నారు. ఉపన్యాసంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రార్థనలు చేసి కుటుంబసభ్యులు, విద్యార్థులు, యువకులు ఉపాధి, ఉద్యోగవకాశాలు పొందాలని చెప్పాలి గానీ రాజకీయ నాయకులతో మాట్లాడించడం సబబుకాదన్నారు.

### ఘనంగా పరశురాముడి జయంతి



**నిజామాబాద్ సిటీ:** నగరంలోని సంతాచార్య దత్త మఠంలో మన సంస్కృతి వేదిక ఇందూరు ఆధ్వర్యంలో పరశురాముడి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ పరశురాముడి జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరశురాం నీతి, నిజాయితీ, ధర్మ గుణాలన్నీ శాస్త్ర సభ్యులకు అలవడాలని భగవంతుడిని ప్రార్థించారు. సార్(సంస్థ) గౌరవ అధ్యక్షులు ఆర్ యుగంధర్ నేతృత్వంలో సభ్యుల అభిప్రాయాలు తెలుసుకుని అధ్యక్షులు రొట్టె రఘునాథ్ ఆధ్వర్యంలో వేదిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మన సంస్కృతి వేదిక ఇందూరు గౌరవ అధ్యక్షుడిగా ఆర్ యుగంధర్, అధ్యక్షుడిగా రొట్టె రఘునాథ్, ఉపాధ్యక్షులుగా దాత్రిక రతన్, వీపీ హృదయ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అమరేంద్రరావు, కోశాధికారిగా చంద్రశేఖర్, సలహాదారులుగా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాజీవ్, తదితరులను ఎన్నుకున్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 61,300 | వెండి (కిలో) | 74,500 |
| 22 క్యారెట్స్ | 56,547 | – నిజామాబాద్ బిజినెస్ | |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 6 | 12 | క్యాప్సికం | 40 | 60 |
| బెండకాయ | 30 | 50 | గాజరుగడ్డ | 15 | 30 |
| బీరకాయ | 30 | 50 | పచ్చిమిర్చి | 30 | 50 |
| దొండకాయ | 20 | 40 | దోసకాయ | 15 | 30 |
| బీర్నీసుకాయ | 60 | 80 | ఆలుగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 40 | 60 | గోబిగడ్డ | 10 | 20 |
| వంకాయ | 15 | 30 | గోబిపువ్వు | 25 | 50 |
| పాలకూర | 20 | 40 | బీట్‌రూట్ | 25 | 50 |
| మెంతికూర | 50 | 70 | గోరు చిక్కుడు | 50 | 70 |
| కొత్తిమీర | 35 | 60 | చిక్కుడుకాయ | 30 | 50 |
| పుదీనా | 20 | 40 | | | |

– ఇందూరు

### మాంసం ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్సిడ్ | 220 |
| | | లైవ్ | 180 |
| స్కిన్‌లెస్ | 260 | మటన్ | 750 |

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**
స్క్రీన్–1– విరూపాక్ష – 1.25 7.35 10.35 శాకుంతలం–4.30
స్క్రీన్–2– దసరా–1.35 7.25 ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్)–4.35 10.25
స్క్రీన్–3– కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.45, 1.40, 4.25, 7.30, 10.20

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**
స్క్రీన్–1– కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.05, 1.15, 4.25, 7.35, 10.45
స్క్రీన్–2– కిస్ కా భాయ్ – కిసి కీ జాన్(హిందీ)–12.05 6.20 9.30 విరూపాక్ష –3.15
స్క్రీన్–3– కిస్ కా భాయ్– కిసి కీ జాన్ – 10.40; విడుదల పార్ట్–1 –1.50 ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్) –8.10 చెంగిజ్(హిందీ)–4.55; విరూపాక్ష –10.30
స్క్రీన్–4– ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్) –11.10 10.05 (రా) శాకుంతలం–1.30 దసరా –4.35 హలో మీరా –7.50

దేవి – రావణాసుర
నటరాజ్ – కిసి కా భాయ్–కిసి కీ జాన్(హిందీ)
లలితామహల్ – దసరా
విజయ్ – విరూపాక్ష

## సమాచారం..

### 28న బోధన్‌కు మందకృష్ణ మాదిగ రాక

**ఖలీల్‌వాడి:** బోధన్‌కు ఈ నెల 28న మందకృష్ణ మాదిగ, మహనీయుల జయంతి ఉత్సవాల కార్యక్రమ సభకు హాజరవుతున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల ఇంఛార్జి గందమల్ల నాగభూషణం అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ, అనుబంధ సంఘాల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల కు తరలండి నినాదంతో మెషీన్ 50 రోజుల కార్యాచరణను విజయవంతం చే యాలన్నారు. 29న బలహీర్గాల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో బాల్కొండలో జరుగుతున్న సభకు మందకృష్ణ హాజరవుతారన్నారు. ఈ రెండు సభలను విజయవంతం చేయాలని తీర్మానం చేశారు. మే 8న ఉమ్మడి ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సమావేశం ఉంటుందన్నారు.

### రేపటి నుంచి ఏకాదశ వార్షికోత్సవం

**డిచ్‌పల్లి:** ధర్మారం(బి)లో ప్రసిద్ధి చెందిన శ్రీదేవీ శ్రీ భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, విజయగణపతి, అభయ ఆంజనేయ స్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సంతాన నాగేంద్ర స్వామి దేవాలయాల ఏకాదశ(11వ) వార్షికోత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.